అమ్మలగన్నమ్మ దుర్గమ్మ


ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయంలో..


శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు


మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారికి శ్రీకాళికాదేవిగా అలంకరణ

- 8వ రోజు దుర్గామాతగా అమ్మవారు
- పులకించిన భక్తజనం

సీటీఆర్‌ఐ: దుర్గామాత దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆ అమ్మవారిని భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.. జిల్లాలోనే ప్రత్యేక చాటుకున్న రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలా త్రిపురసుందరీ దేవి అమ్మవారిని 8వ రోజు ఆదివారం దుర్గామాతగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కుంకుమ పూజలు చేసేందుకు పోటీ పడ్డారు. దసరా ఆఖరి రోజులు కావడంతో భవానీ భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నగరంలోని ఉమామార్కండేయేశ్వర స్వామి దేవాలయంలో వెలిసిన స్వయంభూ పార్వతీ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శంకరమఠం, ఉమారామలింగేశ్వర స్వామివారి దేవాలయం, ఉమా కోటిలింగాల దేవాలయం, శ్రీరంగధరేశ్వర స్వామి దేవాలయం, సరస్వతీ ఘాట్‌లలో అమ్మవార్లను దుర్గాదేవిగా తీర్చిదిద్దారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని క్లాత్ బటన్స్‌తో అలంకరించారు.

జయహో దుర్గాభవాని

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఎనిమిదో రోజు ఘనంగా జరిగాయి. మోరంపూడి సాయినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీవిజయ కనకదుర్గాదేవి ఆలయంలో 33వ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయ గౌరవాధ్యక్షుడు పిల్లి శ్రీను నేతృత్వంలో అమ్మవారిని శ్రీకాళికాదేవిగా అలంకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు పర్యవేక్షించారు. బాలాజీపేట సెంటర్‌లో వేంచేసి ఉన్న విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. బొమ్మూరు వెంకటగిరి కొండపై చిరుస్టార్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

విజయ దశమి అంటే అన్నీ శుభాలే..

ఎంపీ భరత్‌రామ్


పుష్కర ఘాట్‌లో పడిపూజ చేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్


గోదావరి హారతి ఇస్తున్న ఎంపీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పవిత్ర విజయ దశమి పర్వదినాన ఏపనైనా ప్రారంభిస్తే అన్నీ శుభాలే కలుగుతాయని పురాణాలు చెబుతున్నాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం స్థానిక పుష్కర ఘాట్ వద్ద భవానీ భక్తులకు ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో భారీ పడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీలు, భక్తులు వేలాదిగా ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. భవానీ మాలధారులు జగన్మాత భవానీ నామస్మరణ చేయడంతో పుష్కర ఘాట్ ప్రాంతం మార్మోగింది. వచ్చిన ప్రతి భవానీ భక్తుడికి ఎంపీ భరత్‌రామ్, ఆయన సతీమణి మోనా భక్తి ప్రపత్తులతో స్వాగతం పలికారు. పుష్కర ఘాట్ వద్ద గోదావరి మాతకు హారతులిచ్చిన తరువాత భవానీ భక్తులకు పడిపూజా కార్యక్రమానికి ఎంపీ భరత్‌రామ్, మోనా, వారి కుమార్తెలు మార్గాని జయాని, మార్గాని శివాన్షి రామ్, ఎంపీ మాతృమూర్తి ప్రసూన, సోదరి జ్యోత్స్న, సోదరుడు విజయకృష్ణ ఏర్పాట్లు చేశారు. భక్తులకు కావాల్సిన ప్రసాదాలను దగ్గరుండి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. తాను భవానీ దీక్ష స్వీకరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంతమంది భవానీ దీక్షాధారులను ఒకచోట కలుసుకోవడంలో ఏదో తెలియని ఆధ్యాత్మిక శక్తి, ఆనందం కలుగుతోందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ఆ శక్తి మాత రూపమే దర్శనమవుతోందని.. ఇదొక అనిర్వచనీయమైన అనుభూతి అన్నారు. విజయ దశమి విజయాలకు సంకేతమని, ఆ కరుణామూర్తిని మనసారా తలచుకుని ఏ పని ప్రారంభించినా విజయం సాధ్యమని అన్నారు. భవానీల పడి పూజలో వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ప్రియ దంపతులు హాజరయ్యారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పడి పూజ విజయవంతానికి కృషి చేశారు.

శంకరన్ ఆదర్శనీయుడు


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్‌ఐ: ఐఏఎస్ ఎస్ ఆర్ శంకరన్ అధికారులకు ఆదర్శనీయమని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. శంకరన్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి ఆదివాసీ మహాసభ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో అయినాపురపు మాట్లాడుతూ 1986లో శంకరన్ సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన జీఓలను పుస్తకంగా ముద్రించారన్నారు. ఇప్పటికీ ఉపయోగపడే 22 జీఓలు ఉన్నాయన్నారు. శంకరన్ ముఖ్య కార్యదర్శిగా ఉన్నప్పుడే ఐటీడీఏలు నెలకొల్పారన్నారు. స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్, ట్రైబుల్ సబ్ ప్లాన్లను ప్రవేశపెట్టారన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యదర్శిగా కారంచేడు బాధితులకు సహాయ పునరావాసాలు కల్పించారని, 2004లో మావోయిస్టులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్చలు జరిపేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం పద్మభూషణ్ ఇచ్చి గౌరవించినప్పటికీ ఆ అవార్డును సున్నితంగా తిరస్కరించి, తన బాధ్యతను మాత్రమే నిర్వర్తించానని వెల్లడించారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, పోతన్న దొర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ విషయాన్ని ఆదివారం ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ తెలిపారు. దీనివల్ల గాంధీపురం-4, కియా షోరూం వెనుక ప్రాంతం, శశి స్కూల్, రెవెన్యూ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాలకు ప్రభావం ఉంటుందన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు

కడియం: నర్సరీ రైతుల సమస్యల పరిష్కారానికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు అన్నారు. కడియం, వేమగిరి, కడియపు సావరం గ్రామాల పరిధిలోని నర్సరీ రైతులతో పోలరాజు, పాలక వర్గ సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. కడియపుసావరంలోని పుష్పలత పూల వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పోలరాజు మాట్లాడారు. నర్సరీ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాలను చూపించేందుకు తమ పాలకవర్గం చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే రైతులకు అవసరమైన పరికరాలను ఉత్పత్తి ధరలకే అందించేందుకు అసోసియేషన్ కార్యాలయం వద్ద స్టాల్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇదే స్ఫూర్తితో నర్సరీల నిర్వహణకు రైతులకు అవసరమైన సేవల్లో వీలైనంతగా అసోసియేషన్ భాగస్వాములుగా అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసోసియేషన్ డైరెక్టర్ రావిపాటి రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సావరం సర్పంచ్ చక్కపల్లి మురళీకృష్ణ, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెనుమాక బుల్లి కొండయ్య, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, డైరెక్టర్ నాగేశ్వరరావు, డైరెక్టర్‌లు గాజుల రత్తయ్య, కొండేపూడి నాగు తదితరులు పాల్గొన్నారు.

పడవ మునక: ఒకరి మృతి

రాజమహేంద్రవరం రూరల్: గోదావరిలో పడవ మునిగి ఒకరు మృతి చెందగా, మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కాతేరు గామన్ బ్రిడ్జి సమీపాన ర్యాంపు నిర్వాహకులు కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో అనధికారికంగా ఇసుక తవ్వుతున్నారు. డ్రెడ్జింగ్ మెషీన్ సామర్థ్యం ఉన్న పంటులను వినియోగించకుండా పడవలతోనే డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఇదేవిధంగా ఆదివారం తెల్లవారుజామున ఇసుక తవ్వకాలకు ఇద్దరు డ్రెడ్జింగ్ మెషీన్‌ను పడవలో తీసుకువెళ్తుండగా, అది బోల్తా పడింది. ఈ సంఘటనలో మృతి చెందిన వ్యక్తి గుంటూరు జిల్లాకు చెందిన చినబాబు(35)గా తెలుస్తోంది. విషయం బయటకు రాకుండా ర్యాంపు నిర్వాహకులు తెల్లవారే సరికే అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేశారని చెబుతున్నారు.